బిసి రిజర్వేషన్లకు మోడీనే అడ్డంకి

- బిల్లుకు రాష్ట్రపతి అడ్డుపడుతున్నారు
- 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరతాం
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్షలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలంగాణలో బిసి రిజర్వేషన్లకు ప్రధాని మోడీనే అడ్డంకి అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ విషయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలంగాణ బిసి బిల్లులకు ఆమోదం తెలపకుండా అడ్డు పడుతున్నారని ఆరోపించారు. 'బిల్లులు ఆమోదం తెలిపేందుకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ అడిగి చాలా రోజులైంది.. ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి సమాధానం రాలేదు. ఇది శోచనీయం. రేపటిలోగా అపాయింట్‌మెంట్ ఇచ్చి, సమస్యను విని పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం. నరేంద్ర మోడీ తాజాగా రాష్ట్రపతిని కలిశారు. బిసి బిల్లులపై అపాయింట్ మెంట్ ఇవ్వొద్దని రాష్ట్రపతిపై ఏమైనా ఒత్తిడి చేశారా..! కావొచ్చు.. బలహీన వర్గాలన్నీ ఆలోచన చేయాలి' అని ముఖ్యమంత్రి అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనలో తెలంగాణ ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేయొద్దని, బిసి బిల్లులకు ఆమోదం తెలపకపోతే ప్రధాని మోడీని తెలంగాణ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్లను ఆమోదిస్తారా? గద్దె దిగుతారా? అని నిలదీశారు. బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా నిర్వహించిన కాంగ్రెస్ పోరుబాటలో ప్రధాని మోడీ టార్గెట్‌గా సిఎం రేవంత్ రెడ్డి కీలక కామెంట్లు చేశారు. 'నరేంద్రమోడీకి జంతర్ మంతర్ వొరస్తా నుంచి సవాల్ విసురుతున్నా.. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా? లేదంటే మిమ్మల్ని గద్దెదించి, ఎర్రకోట మీద మూడు రంగుల జెండా ఎగరేసి, రాహుల్ గాంధీని ప్రధానిని చేసి, 42శాతం బిసి రిజర్వేషన్లు సాధించుకోమంటారా? ఏది ఏమైనా బిసి రిజర్వేషన్లు సాధించే వరకు మేం నిద్రపోం..' అని హెచ్చరించారు. 'అయ్యా.. నరేంద్రమోడీగారూ.. మీ గుజరాత్ నుంచి గుంట భూమి అడగలేదు. మీ పోరుబందర్ పోర్ట్ నుంచి గుక్కెడు నీళ్లడగలేదు.. మా తెలంగాణలో మా గడ్డ మీద బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వమంటుంటే మీ గుజరాత్ వాళ్లకు వచ్చిన కడుపు మంట ఏంటి? రిజర్వేషన్ల కోసం బిల్లులు ఆమోదించి.. 4.5 కోట్ల మంది ప్రజలు విజ్ఞప్తి చేస్తే మా బిల్లులను తుంగలో తొక్కి అధికారం మీకివదిచ్చారని అడుగుతున్నా..' అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

మా పోరాటం మోడీతోనే...

'మన పోరాటం.. రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న చంద్రశేఖర్‌రావుతోనో, కిషన్ రెడ్డితోనో, బండి సంజయ్‌తోనో, రాంచందర్‌రావుతోనో కాదు.. మన పోరాటం కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడీతో'..' అని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్న ఆలోచన నరేంద్రమోడీకి లేదు.. కానీ ఆయన మోచేతి నీళ్లు తాగుతున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావుకు ఏమైంది? మీరు మళ్లీ తెలంగాణకు రారా? తెలంగాణ ఓట్లు మీకు అవసరం లేదా? బీఆర్ఎస్ తెంపుకున్నట్లే తెలంగాణ రాష్ట్ర ప్రజలతో మీ పేగు బంధం తెంపుకున్నారా?' అని ప్రశ్నించారు.

సాధించి తీరుతాం...

బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ బిల్లులు ఆమోదం పొందే వరకు తాము నిద్రపోమని స్పష్టం చేశారు. బలహీన వర్గాలపై కక్ష గట్టిన గత సిఎం కెసిఆర్ 50 శాతం రిజర్వేషన్లు మించకుండా చట్టం చేశారని విమర్శించారు. 'నాడు కేసీఆర్ చేసిన చట్టం నేడు రిజర్వేషన్లకు గుదిబండగా మారింది. తెలంగాణలో బలహీన వర్గాల బిడ్డలు సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు కాకుండా అడ్డుగా ఉన్న చట్టాన్ని తొలగించాలని తాము ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపాం. దానిని ఆమోదించడం లేదు. వెనుకబడిన వర్గాలకు స్థానిక ఎన్నికల్లో.. విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీలో ధర్నాకు దిగాం, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధించి తీరుతాం' అని సిఎం తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణలోనైనా ధర్నా చేయొచ్చని... కానీ అక్కడ ధర్నా చేస్తే స్థానిక పార్టీలు మాత్రమే వస్తాయని.. అందుకే ఢిల్లీలో ధర్నా చేస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో ధర్నా చేయడంతోనే కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎంపీలతో పాటు ఇండియా బ్లాక్‌లోని సమాజ్‌వాదీ పార్టీ, డిఎంకె, ఎన్‌సిపి, వామపక్షాలకు చెందిన వంద మంది ఎంపీలు ధర్నాలో పాల్గొని మనకు సంఘీభావం తెలియజేశారని తెలిపారు.

ఆ నలుగురు..

తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావులు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డుపడుతున్నారని సిఎం ఆరోపించారు. వీళ్లకు తెలంగాణ బీసీల అవసరం లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాకు ఎందుకు రాలేదని, ఆ పార్టీ తెలంగాణతో పేరు బంధంతో పాటు పేగు బంధం కూడా తెంచుకుందా అని నిలదీశారు. ఎడ్యుకేషన్, ఎంప్లాయ్‌మెంట్, పొలిటికల్ రిజర్వేషన్ పంచాయతీ మెంబర్ల నుంచి పార్లమెంట్ వరకు ఎవరికి ఎంత వాటా దక్కాలన్న విషయంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలిందే అన్నారు. అలా జరగకుండా బిజెపి, ఎన్‌డిఎ మోసం చేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ధర్నా చేస్తోన్న బిజెపికి కనువిప్పు కలగడం లేదని ఫైర్ అయ్యారు. పార్లమెంట్‌లో కూడా మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో ధర్నాలు చేపట్టి రిజర్వేషన్లు సాధిస్తామన్నారు. రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్న బిజెపికి గుణ పాఠం చెబుతామన్నారు. అందుకోసం బలహీనవర్గాల శక్తిని కూడా కూడగట్టుకొని ఢిల్లీ జంతర్ మంతర్ లో పోరాటం కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ధర్నాలో డిప్యూటీ భట్టి విక్రమార్క, మంత్రులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులకు వినతి పత్రం అందజేస్తున్న మంత్రి తుమ్మల

రాష్ట్రానికి యూరియా కొరత తీర్చండి

- కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, నడ్డాకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: రాష్ట్రానికి యూరియా కొరత తీర్చాలంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జేపీ నడ్డాను ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డితో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఆగస్టు మాసంలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని గుర్తు చేశారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్రానికి కేటాయించిన యూరియాను వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని గుర్తు చేశారు. ఏప్రిల్ నుంచి జూలై మధ్య ఏర్పడిన 2.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరతను కూడా ఆగస్టు నెలలో మంజూరు చేయాలని పేర్కొన్నారు.

మహారాష్ట్రకు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
అద్దంకి
A.S. No:03/2024
చిట్టెంశెట్టి హైమావతి .....పిటీషనర్
మరియు
బూదాటి వెంకట్రావు మరియు కొందరు. ..... రెస్పాండెంట్స్
To
1.బూదాటి వెంకట్రావు (R1)
S/o లేటు కోటేశ్వరరావు
R/o D. No: 3-32
కృషి నిలయం, సత్యనారాయణ గుడి దగ్గర,
రామంతపూర్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
2.బూదాటి ప్రసాదరావు (R2)
S/o లేటు కోటేశ్వరరావు
R/o D. No: 3-401/610, శాంతినగర్,
రామంతపూర్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
పైనఉదహరించిన దావాలో మీకు వ్యతిరేకంగా నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టువారి ఉత్తర్వుల మేరకు మీరు తేది 22-09-2025వ తేదీ ఉదయం 10.30గం.ల నుండి సాయంత్రం 5:00 లోపు పైకోర్టు వారి ఎదుట హాజరై తమ అభ్యంతరం తెలుపుకొవలెను. లేనిచో దావాను మీ పరోక్షంగా తీర్మానించబడును.
// శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా తేది : 22-09-2025
మోతుకూరి సుభాష్ బాబు
మద్దినేని గృహలక్ష్మి
అడ్వకేట్స్, అద్దంకి

IN THE COURT OF THE MACT CUM HON'BLE XI ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT, AT:: HYDERABAD
MVOP.No. 345 OF 2025
BETWEEN:
Kompally Sarojana and others. ...Petitioners.
AND
Vandana Kadam and others. ...Respondents.
To,
Vandana Kadam W/o Sudharshan, Age: Major, Owner of Brezza car bearing No. TS-01-EK-9290, R/o: 161-B, APHB Colony, TTD Road, Adilabad, Telangana State - 504 001.
Respondent No.1.
Please take notice that the petitioners have filed the above O.P. against you No.1 and other respondents for claiming compensation for the death of deceased Kompally Venkat Reddy S/o Kompally Raghava Reddy in the road accident which was occurred on 30-09-2024 at about 20:00 hours near spirit wines, Medchal Checkpost, Medchal, Cyberabad in the limits of P.S. Medchal, Cyberabad, by respondent's No.1 vehicle i.e., Brezza car bearing No.TS-01-EK-9290. The said O.P. is posted to **09.09.2025 at 10.30 AM** for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before this Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided on your obsence.
Hence this notice.
//BY ORDER OF THE COURT//
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet, Hyderabad
Ph: 7673904549
9330489999

ఇందిరమ్మ పాలన కాదు.. బకాయిల పాలన

- మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి : ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలంగాణలో నడుస్తున్నది ఇందిరమ్మ పాలన కాదు..బకాయిల పాలన అని బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ సర్పంచులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వారికి ఇచ్చే రూ.మూడు వేల గౌరవ వేతనాన్ని మూడునెలలుగా ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. వారికిస్తామన్న ఇఎస్ఐ, పిఎఫ్ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. రేషన్‌డీలర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కోరారు. గ్రామపంచాయతీల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లకు నాలుగు నెలలుగా జీతాలివ్వలేదని ఎత్తిచూపారు. ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోతున్నాయని చెప్పారు.

అమెరికా ఆంక్షలను సహించబోం

- పోస్టర్ ఆవిష్కరణలో టి సాగర్ పిలుపు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న టి సాగర్ తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
వ్యాపారంపై అమెరికా ఆంక్షలను సహించబోమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపునిచ్చారు. ట్రంప్‌కు సంఘీభావంగా నిలబడవద్దని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ట్రంప్‌కు సంఘీభావంగా నిధులు సేకరించాలని పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్న ట్రంప్‌కు ఆర్థికంగా మద్దతు ఇచ్చేందుకు 'క్యూబా సాలిడారిటీ నిధి'ని సేకరించాలని పిలుపునిచ్చారు. అమెరికన్ సామ్రాజ్య వాదాన్ని ఎదిరించి, దేశ సార్వభౌమత్వం కోసం పోరాడుతున్న క్యూబాకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా నిధులు సేకరించాలని ఎఐకెఎస్ పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతుల దగ్గర నుంచి నిధులు సేకరించాలని కోరారు. ఫిడేల్ క్యాస్ట్రో వందేండ్ల జయంతి సందర్భంగా ఆ నిధిని క్యూబా సాలిడారిటీ జాతీయ కమిటీకి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

సులభతర వాణిజ్యంలో తెలంగాణ టాప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సులభతర వాణిజ్యంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు అన్నారు. బుధవారం సచివాలయం సిఎస్ అధ్యక్షతన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై సిఎస్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశంలో రాష్ట్రంలో వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో వివిధ సంస్కరణల అమలు స్థితిని ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, నియంత్రణ ప్రక్రియలను సరళీకృతం చేయడం ద్వారా మరింత మెరుగుదలకు గణనీయమైన అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి, ఉపాధి అవకాశాలు సృష్టించడానికి ఈ ప్రయత్నాలు చాలా కీలకమని చెప్పారు.

నిర్వాసితుల జోలికొస్తే సహించేది లేదు

- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఎల్ఎండీ డ్యాం కట్ట పరిధిలోని ఇండ్లను ఖాళీ చేయాలని నీటిపారుదల శాఖ అధికారులు నోటీసులు జారీ చేయడంపై కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హస్నాపూర్ కాలనీ, బతుకమ్మ కాలనీల వాసులను ఖాళీ చేయాలని అధికారులు ఐదు రోజుల కిందట నోటీసులు పంపించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి కాలనీల్లో పర్యటించారు. కాలనీవాసులు కన్నీటిపర్యంతమవుతూ తమ గోడును వారికి వివరించారు. దాదాపు 30 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నామని, ప్రభుత్వ భూములు కావని, పట్టా స్థలాల్లో ఇండ్లు కట్టుకున్నామని తెలిపారు. అనాడే ఇళ్ల నిర్మాణానికి పర్మిషన్లు, కరెంట్, రోడ్లు ఇచ్చారని, పన్నులు చెల్లిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు డ్యాం సేఫ్టీ పేరుతో ఇండ్లను ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడంతో ఏం చేయాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాయకష్టం చేసుకొని ఇళ్లు నిర్మించుకుంటే, వాటిని కూల్చేస్తామంటే తమ బతుకేంటని మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల నీటిపారుదల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి హెచ్చరించారు. పేదల జోలికి వస్తే సహించేది లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు స్పందించి పేదలకు భరోసా ఇవ్వాలని కోరారు. పేదల ఇండ్లు కూల్చేందుకు వస్తే బీఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ శ్రేణులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. కరీంనగర్ అంటేనే ఉద్యమాల ఖిల్లా అని, ఇక్కడి ప్రజలు ఎవరి జోలికీ వెళ్లరని, కానీ వారి జోలికొస్తే ఊరుకోరని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్రరాజు, మాజీ కార్పొరేటర్లు ఎడి రమణ, దిండిగాల మహేష్, నక్క కృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, గుగ్గిల్ల శ్రీనివాస్ ఉన్నారు.

అధ్వానంగా భద్రాచలం- వెంకటాపురం రోడ్డు

- ప్రజా సమస్యలపై సిపిఎం పోరాటం
- మండల బంద్ సక్సెస్ : సిపిఎం

బంద్‌లో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి రెడ్డి సాంబశివ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
భద్రాచలం నుంచి వెంకటాపురం ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. అడుగుకో గుంతతో ప్రధాన రహదారి చిధ్రంగా తయారైంది. స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మొద్దు నిద్ర కారణంగా రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదలచేయించలేకపోతున్నారు. రాత్రివేళ కంగి పోయి మూడు నెలలు అవుతున్నా.. భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు ఒక్క బస్సు సౌకర్యం నిలిపివేసినా ఎమ్మెల్యేకు చలనం లేకుండా పోయింది. రోడ్డు మరమ్మత్తులకు రూ.100 కోట్లు కేటాయించాలని, రాత్రివేళపై కంగిపోయిన బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేసి రవాణా సౌకర్యం మెరుగుపరచాలని బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ములుగు జిల్లా వెంకటాపురం మండలం బంద్‌కు పిలుపునిచ్చారు. మండలంలో విశేష స్పందన లభించింది. దుకాణాలన్నీ స్వచ్ఛందంగా మూసివేశారు. పెట్రోల్ బంక్‌లు, బ్యాంకులు, పాఠశాలలు మూతపడ్డాయి. మండల కేంద్రంతోపాటు, సూరవీడు, అలుబాక, ఆంక్యాగూడెం, వెంకటాపురంలో సంపూర్ణ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి రెడ్డి సాంబశివ మాట్లాడుతూ.. పది రోజులుగా సిపిఎం ఆధ్వర్యంలో రోడ్ల సమస్యపై నిరంతర పోరాటం కొనసాగుతుందని, అందులో భాగంగానే ఈరోజు మండలం బంద్ నిర్వహించినట్లు తెలిపారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించారని, కానీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వెళ్లడానికి కూడా దారి లేక పేషెంట్లు నానా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఆయన నియోజకవర్గ ఎమ్మెల్యేకు చీమకుట్టినట్టుగా లేదని అన్నారు. గత నెల రోజులుగా భద్రాచలం నుంచి బస్సులు రాక ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఆటోల్లో ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. హనుమకొండ నుంచి వచ్చే సర్వీసులు యాకన్న గూడెం వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరు చేసేంతవరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. ఏజెన్సీ ఖనిజ సంపద ద్వారా వచ్చిన ఆదాయంలో కనీసం పది శాతం కూడా అభివృద్ధికి ఖర్చు చేయడం లేదన్నారు. జిల్లా మంత్రి సీతక్క, నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రులు పొంగులేటి, తుమ్మల ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇసుక లారీలను నియంత్రించి, రోడ్డు మరమ్మతులకు కేటాయించే వరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గ్యాంగ్ నాగు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రఘుపతి, నాయకులు కుమ్మరి శ్రీను, కట్ల నరేంద్ర బాబు, వంకా రాములు, చిట్టెం ఆదినారాయణ, తోట నాగేశ్వరరావు, బొగట విజయ్, చిత్తూరి సాంబశివరావు, గుండమ్మల ప్రసాద్, జజ్జరి దామోదర్ పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ లైన్ల స్థానంలో ఎయిర్ బంచ్డ్ కేబుల్

- ఆ తీగల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్
- మెట్రో జోన్ పరిధిలో 550 కిలోమీటర్ల ఎల్‌టీ ఓవర్ హెడ్ కండక్టర్ల మార్పిడి
- టిజి ఎస్పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముషారఫ్ ఫరూఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బస్తీలు, చిన్న చిన్న గల్లీల్లో ఇండ్లకు దగ్గరగా ప్రమాదకరంగా ఉన్న ఎల్‌టీ విద్యుత్ తీగల (ఓవర్ హెడ్ కండక్టర్) స్థానంలో ప్రత్యేక ఇన్సులేషన్ ఉన్న ఎయిర్ బంచ్డ్ కేబుల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజి ఎస్పిడిసిఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. దీనికి సంబంధించి గత వారం మెట్రో జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లు బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో నిర్వహించిన పోల్ టు పోల్ తనిఖీల్లో దాదాపు 550 కిలోమీటర్ల మేర ఎల్‌టీ ఓవర్ హెడ్ కండక్టర్ మార్చాల్సిందని నివేదికలో గుర్తించారు. దీన్ని మార్చడానికి కార్యాచరణ రూపొందించామని, గుర్తించిన ప్రదేశాల్లో ఈ నెలాఖరు వరకు ఓవర్ హెడ్ కండక్టర్ స్థానంలో ఎబి కేబుల్ అమర్చనున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఇతర సర్కిళ్లలో కూడా ఈ సేవలు విస్తరించనున్నామని తెలిపారు. బుధవారం సంస్థ ప్రధాన కార్యాలయంలో మెట్రో జోన్ పరిధిలోని సుమారు 160 మంది సబ్-ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై అసిస్టెంట్ ఇంజనీర్లతో ఆరా తీశారు. అనంతరం సిఎండి మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో అసిస్టెంట్ ఇంజనీర్లు సంస్థకు టీం లీడర్ వంటి వారన్నారు. సమస్యల పరిష్కారం, సంస్థ పురోభివృద్ధిలో ఏఈలదే కీలక పాత్ర అని తెలిపారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులపై వారి సూచనలే నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో కీలక భూమిక పోషిస్తాయన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్లు సమయపాలన పాటిస్తూ వినియోగదారులకు అందుబాటులో ఉంటూ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డాక్టర్ నర్సింహులు, చక్రపాణి, ఎస్ఇ వేణుగోపాల్, మెట్రో జోన్ పరిధిలోని సబ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎసిబి అధికారులు

ఎస్‌టి బాలుర ఆశ్రమ పాఠశాలలో

'ఎసిబి' ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం మహమ్మదాబాద్ గ్రామ సమీపంలో ఉన్న ఎస్‌టి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఎసిబి మున్సిపల్, శానిటేషన్, లీగల్, మెట్రాలజీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలోని స్టాక్ మెనూ రిజిస్టర్లను, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ మాట్లాడుతూ.. డిజి ఆదేశాల మేరకు సాధారణ తనిఖీ నిర్వహించామన్నారు. ఈ తనిఖీలో పాఠశాలలో పారిశుద్ధ్య లోపం, శిథిలావస్థకు చేరిన స్కూల్ భవనం, విద్యార్థులకు మూత్రశాలలో నీటి సౌకర్యం లేకపోవడంతో అపరిశుభ్రంగా ఉన్నాయని గుర్తించినట్లు తెలిపారు. మరుగుదొడ్డు, వంట గదిలో పరిశుభ్రత లేకపోవడంతో పాటు హాస్టల్‌కు ప్రహరీ గోడ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజూ భోజనం వడ్డించాలని తెలిపారు. ఈ తనిఖీలో ఎసిబి సిఐలు రమేష్, వెంకటేశ్వర్లు, మున్సిపల్, శానిటేషన్, మెట్రాలజీ అధికారులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు చెల్లించాలి

- అరెస్టులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మధ్యాహ్న భోజన కార్మికుల వారి సమస్యలను పరిష్కరించాలంటూ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి బుధవారం వస్తుంటే కార్మికులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం సరైంది కాదని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. వారిని తెలిపింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రమను గృహ నిర్బంధం చేయడాన్ని ఖండించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌ను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని విమర్శించారు. అరెస్టుల సందర్భంగా అనేక మంది కార్మికులు గాయపడ్డారని తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించకుండా అరెస్టులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. రెండేండ్లు కావస్తున్నా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కొత్త మెనూ అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ, అవసరమైన నిధులను కేటాయించడం లేదని తెలిపారు. ఆయినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ నిధులను కేటాయించడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కొత్త మెనూ అమలు చేస్తున్నందున మెనూకు సరిపడా నిధులు కేటాయించాలని, వేతన బకాయిలు, గుడ్ల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేస్తున్న ఉద్యమానికి పూర్తి మద్దతును తెలియజేస్తున్నామని తెలిపారు.

IN THE COURT OF THE MACT CUM HON'BLE XXVI ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT, AT :: HYDERABAD
MVOP.No. 1839 OF 2024
BETWEEN:
Pittala Balamma and another. ...Petitioners.
AND
Emula Ujwal and others. ...Respondents.
To,
Emula Ujwal S/o Emula Rangaiah, Age: Major, Owner Shine bike bearing No.TS-07-HU-4253, R/o: Plot No.285/A, SM Garden Janardhan Hills, Gachibowli, Hyderabad, Telangana State - 500 032.
...Respondent No.1.
Please take notice that the petitioners have filed the above O.P. against you No.1 and other respondents for claiming compensation for the death of deceased Gaddam Pittala Parvathalu S/o Late Peddaiah in the road accident which was occurred on 15-06-2024 at about 09:00 hours at near Amrutha Hotel, Mannanur village and Mandal, Nagarkurnool District, by respondent's No.1 vehicle i.e., Shine bike bearing No.TS-07-HU-4253. The said O.P. is posted to **10.09.2025 at 10.30 AM** for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before this Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided on your obsence.
Hence this notice.
//BY ORDER OF THE COURT//
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet, Hyderabad
Ph: 7673904549
9330489999

ఖ్యాల్‌తో ట్రూకాలర్ జట్టు

హైదరాబాద్ : వృద్ధులను డిజిటల్ మోసాల నుండి కాపడటానికి ఖ్యాల్‌తో ట్రూకాలర్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఇది అధునాతన కాలర్ గుర్తింపు సాంకేతికతతో కలిపి సురక్షితమైన కమ్యూనికేషన్‌ను పెంపొందిస్తుందని ఇరు సంస్థలు పేర్కొన్నాయి. 'ఈ ఒప్పందం వృద్ధులకు సురక్షిత డిజిటల్ అనుభవం కోసం పరిజ్ఞానం, సాధనాలను అందిస్తుంది." అని ట్రూకాలర్ సిఇఒ రిషిత్ ఝున్‌ఝున్‌వాలా పేర్కొన్నారు. "మోసాలు వృద్ధుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ట్రూకాలర్‌తో కలిసి వారిని సాధికారపరుస్తున్నాము." అని ఖ్యాల్ సిఇఒ హేమంశు జైన్ పేర్కొన్నారు.

ఎఫ్‌టిసిసిఐ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ గరిమెళ్ల

హైదరాబాద్ : ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) నూతన ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ గరిమెళ్ల ఎన్నికయ్యారు. ఆయన నియామకాన్ని ఆ సంస్థ మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించారు. ప్రస్తుతం ఆయన జపనీస్ బహుళజాతి సంస్థలో కీలక సారథ్య బాధ్యతలను పోషిస్తున్నారు. ఒక దశాబ్దం పాటు ఎఫ్‌టిసిసిఐతో సన్నిహితంగా ఉంటున్నారు.

జయశంకర్‌కు కెటిఆర్ నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఆయన చిత్రపటానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. స్వరాష్ట్ర ఉద్యమానికి జయశంకర్ చుక్కానిగా నిలిచారని స్మరించుకున్నారు. తెలంగాణ భావజాలవ్యాప్తికే తన జీవితాన్ని ధారబోసిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమ రథసారథి కెసిఆర్‌కు అండగా ఉంటూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సాకారం చేసేందుకు కడదాక పోరాడారని అన్నారు. జయశంకర్ పేరు తెలంగాణ చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఫ్లోర్ లీడర్ సురేష్ రెడ్డి, సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు, పార్థ సారధి రెడ్డి, మాజీ ఎంపి బొయిన పల్లి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్ నివాళులు

తెలంగాణ అసెంబ్లీ, మండలిలో బుధవారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి ఆవరణలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. తెలంగాణ ఆవశ్యకతను యువతకు అర్థం అయ్యేలా రచనలు చేసి ఉద్యమానికి ఊపిరిగా నిలిచారని కొనియాడారు. జయశంకర్ జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

'సత్యా'నిదే గెలుపు

ఆప్ రాష్ట్ర ఇన్‌చార్జి కన్వీనర్ దిడ్డి సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యేంద్ర జైన్‌పై బిజెపి సర్కారు అక్రమంగా మోపిన కేసులను కోర్టు కొట్టి వేయడం పట్ల ఆప్ రాష్ట్ర ఇన్‌చార్జి కన్వీనర్ దిడ్డి సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ట్యాంక్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిబిఐ దుర్వినియో గానికి నిరసనగా మౌన ప్రదర్శన నిర్వహిం చారు. సత్యానిదే గెలుపు అని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా బిజెపికి ఆమ్‌ఆద్మీపార్టీయే ప్రత్యామ్నాయం శక్తిగా అని స్పష్టం చేశారు.

ముస్లిములను చేరిస్తే బిసిలకు మిగిలేది 32 శాతమే : పాయల్ శంకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ముస్లిములకు రిజర్వేషన్లను పదిశాతానికి పెంచాలనే ఆతృతతో ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు ధర్నాచేస్తున్నట్టు ఉందని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముస్లింలను బిసి రిజర్వేషన్ల జాబితా నుంచి తొలగించాలని మొదటి నుంచీ తాము డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. బిసిలకు న్యాయం చేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కసారైనా బిసిని సిఎం చేయాలనే ఆలోచన కాంగ్రెస్‌కు రాలేదని విమర్శించారు. బిజెపి పాలిత 20 రాష్ట్రాలుంటే అందులో పది రాష్ట్రాల్లో బిసి, ఎస్సి, ఎస్టి సిఎంలు ఉన్నారని తెలిపారు.

బిసి రిజర్వేషన్లు అమలు చేయాలి

- రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో 9,10న ధర్నాలు
- బీహార్‌లో ఓట్ల తొలగింపును వ్యతిరేకిస్తూ రేపు నిరసనలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గం పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు పార్లమెంటులో చట్టం చేయాలని, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల తొమ్మిది, పది తేదీల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గం పిలుపునిచ్చింది. ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సమావేశం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో నిర్వహించారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితిని, భవిష్యత్ కర్తవ్యాలను చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. బీహార్‌లో జరగబోయే ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించి, అక్రమ పద్ధతుల్లో అధికారంలోకి రావాలని కుట్రపన్నుతున్నదని విమర్శించారు. దాదాపు 64 లక్షల ఓట్లను ఎన్నికల కమిషన్ తొలగించిందని తెలిపారు. ఇందులో అత్యధికంగా మైనార్టీలు, ప్రతిపక్షాలకు సంబంధించిన ఓట్లే ఉన్నాయని పేర్కొన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఓట్లేస్తారని భావించి తొలగించిందని విమర్శించారు. ఎస్సీ నియోజకవర్గాల్లో 40 నుంచి 60 శాతం ఓట్లను తీసేసిందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అండదండలతో బీజేపీ ఆ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని కుట్ర పన్నుతున్నదని పేర్కొన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి

రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టం చేయాలని, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈనెల తొమ్మిది, పది తేదీల్లో ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బిసిలకు సంబంధించిన రిజర్వేషన్లు మైనార్టీలు పొందకూడదని అక్రమ పద్ధతుల్లో బిజెపి నాటకమాడుతున్నదని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, యూపీ, ఇతర రాష్ట్రాల్లో మైనార్టీలకు బిసి రిజర్వేషన్లను అమలు చేస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో మాత్రం దానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నదని పేర్కొన్నారు. ముస్లిముల్లో దూదేకుల తదితర అట్టడుగు తరగతుల వారున్నారని వివరించారు. వెనుకబడినవారు కాబట్టే వారికి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తెలిపారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం లేదన్న విషయాన్ని మండల్ కమిషన్ కూడా చెప్పిందని గుర్తు చేశారు. బిసిల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్ర అని విమర్శించారు. ఇప్పటికైనా బిజెపి ఆ పద్ధతులను ఉపసంహరించుకుని, రాష్ట్రంలో బిసిలకు రిజర్వేషన్లు అమలు జరిగేలా, కేంద్రంలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని, కలిసొచ్చే శక్తులన్నింటినీ కలుపుకుని ఐక్యంగా కేంద్రంపై ఒత్తిడి పెంచేలా ఉద్యమించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి హక్కులను సాధించుకునేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. అలాంటి కార్యక్రమానికి తమ పార్టీ మద్దతునిస్తుందని తెలిపారు.

స్వచ్ఛమైన శాస్త్రీయ సంగీతమూర్తి పురాణం పురుషోత్తమ శాస్త్రి

ప్రజాశక్తి కల్చరల్

నేడు శాస్త్రీయ సంగీతం కూడా సినిమాల ప్రభావంతం తో వింత పోకడలు పోతున్న సందర్భం లో పురాణం పురుషోత్తమ శాస్త్రి వంటి సంగీతజ్ఞులు కనిపించటం లేదని శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. స్వచ్ఛమైన శాస్త్రీయ సంగీతమూర్తి పురాణం పురుషోత్తమ శాస్త్రి అని ఆయన కొనియాడారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంత రావు కళా వేదికపై విఖ్యాత కర్ణాటక సంగీ సంగీత గురువు పురాణం పురుషోత్తమ శాస్త్రి శత జయంతి వేడుకలు గాన సభ నిర్వాహణలో జరిగాయి. ముఖ్య అతిథిగా మధుసూదనాచారి పాల్గొని సంగీత గురువు తరంగిణి సత్కరించి మాట్లాడారు. ఐదు దశాబ్దాల పైగా పురుషోత్తమ శాస్త్రి ఎందరో సంగీత కళాకారులను దేశానికి అందించారని ఆయన కు పరోక్ష శిష్యులు కూడా వున్నార ని చెప్పారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ తమ తండ్రి కళా సుబ్బారావు గాన సభ అధ్యక్షులుగా ఉన్న కాలం నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు పురుషోత్తమ శాస్త్రి గాన గోష్టి లేకుండా లేదని చెప్పారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ పురుషోత్తమ శాస్త్రి వారసత్వం ఆయన కుమార్తె తరంగిణి కొనసాగిస్తున్నారని ఆమె తమ కోడలు కావటం సంతోషం అని చెప్పారు. వేదికపై రచయిత్రి డాక్టర్ సుధ గాయని శ్రీమణి పాల్గొన్నారు. తొలుత తరంగిణి రామరాజు త్యాగరాజ కీర్తనలు మధురంగా ఆలపించారు.

అర్హులను మహిళా సంఘాల్లో చేర్పించండి

- అధికారులను ఆదేశించిన సెర్ప్ అదనపు సిఇఒ కాత్యాయని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్హులైన మహిళలను వెంటనే మహిళా సంఘాల్లో చేరేలా అవగాహన కల్పించాలని అధికారులను సెర్ప్ అదనపు సిఇవో కాత్యాయని ఆదేశించారు. కౌమార స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆమె 32 జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సెర్ప్ ఎపిడిలు, డిపిఎంలు, ఎపిఎంలతో జూమ్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగంగా వృద్ధుల, వికలాంగుల, కిషోర బాలిక సంఘాలను నూతనంగా ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కోటిమందిని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో చేర్చేలా చూడాలన్నారు. అందులో భాగంగా ఈ నెల 11 నుంచి 30వ తేదీ వరకు గ్రూపుల్లో చేరేలా మహిళలకు అవగాహన కల్పించడం, జిల్లా, మండల స్థాయిలో వారితో సదస్సులు, సమావేశాలు నిర్వహించి సంఘంలో చేరితే జరిగే ప్రయోజనాలను విడమర్చి చెప్పాలని సూచించారు.

పేద పిల్లల భవిష్యత్‌కు ప్రతిభా పురస్కారాలు దోహదం

- తెలంగాణ బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి ఎన్ సోమయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిభా పురస్కారాలు పేద, బడుగు-బలహీన వర్గాల పిల్లల భవిష్యత్‌ను మెరుగుపరచడానికి తోడ్పడతాయని తెలంగాణ బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి ఎన్ సోమయ్య తెలిపారు. తెలంగాణ బాలోత్సవం" ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 7,8,9 తరగతుల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు "ప్రతిభ గల పిడుగులకు - ప్రతిభా పురస్కారాలు" ప్రదానోత్సవ కార్యక్రమం ఈనెల 12న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి తెలంగాణ బాలోత్సవం నుంచి ఇప్పటికే ప్రతి స్కూల్లోనూ అప్పీల్ లెటర్ ఇచ్చి వివరించినట్టు తెలిపారు. దాదాపు 100కు పైగా పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల పేర్లు పంపించారన్నారు.

దాదాపు వెయ్యి మంది విద్యార్థులు ఈ సత్కారానికి అర్హులవుతున్నారని, వీరందరికీ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందించనున్నట్టు వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు-బలహీన వర్గాల పిల్లల భవిష్యత్‌ను మెరుగుపరిచేందుకు, ప్రోత్సహించడానికి, వారిలోని ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఇంకా మిగిలిన పాఠశాలలు కూడా వెంటనే విద్యార్థుల పేర్లు, క్లాసు, వారి మెరిట్ మార్కులతో లిస్ట్ వాట్సప్ నెం.9490098676కు మెసేజ్ చేయాలని కోరారు. పాటలు, గేయాలు, ఏకపాత్రాభినయాలు, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. బాలికల అభివృద్ధి, వారి ఆరోగ్యం, మానసిక ఒత్తిడి, ఉన్నత విద్య, ఉద్యోగాలపై ప్రత్యేక అవగాహన పెంచేందుకు తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో పాఠశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు సుజావతి, మమత, మహేష్ దుర్గే పాల్గొన్నారు .

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎన్ సోమయ్య తదితరులు

చేనేత రంగానికి సర్కార్ పెద్దపీట

- టిజిఎస్‌సిఒ ద్వారా రూ.587.26 కోట్ల వస్త్రాల ఆర్డర్లు
- నేడు హైదరాబాద్‌లో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు
- 33 మంది నేత కార్మికులకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. వారికి ఆర్థికంగా చేయూతనందించేందుకు అన్ని శాఖలు, కార్పొరేషన్లు, సంస్థల ద్వారా వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2025-26లో ఇప్పటివరకు రూ.587.26 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చింది. ఇందిరా మహిళ శక్తి స్వయం సహాయక బృందాలకు చెందిన 65 లక్షల మంది మహిళలకు ఏడాదికి రెండు సార్లు ఉచితంగా చీరల పంపిణీ చేసేందుకు 131 మ్యాక్స్, 56 చిన్నతరహా పరిశ్రమల్లో చీరలు తయారు చేయిస్తున్నారు. రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌తో గతేడాది తెలంగాణ చేనేత కార్మిక సహకార సంఘం (టీజీఎస్‌సీవో) నోడల్ ఏజెన్సీగా వేములవాడలో యార్న్ డిపోను ఏర్పాటు చేసింది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని హైదరాబాద్‌లో నెలకొల్పింది. రూ.33 కోట్లతో చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు రుణ మాఫీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. తెలంగాణ చెనేత అభయహస్తం (థ్రిఫ్ట్ ఫండ్)లో భాగంగా కార్మికులు తమ జీతం నుండి రూ.8 పొదుపు చేస్తే, ప్రభుత్వం వారి జీతానికి డబుల్ మద్దతుగా ఇస్తుంది. ఈ పథకంతో 36,133 మంది చేనేత కార్మికులు 15 వేల మంది పవర్‌లూమ్ కార్మికులు లబ్ధిపొందుతున్నారు. ఈ ఏడాది బడ్జెట్లో ఇందుకోసం రూ.30 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. తెలంగాణ నెతన్న భద్రత పథకం కింద చనిపోయిన చేనేత, అనుబంధ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నది. కార్మికులకు ప్రోత్సాహకంగా సంవత్సరానికి రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.6 వేలు అందిస్తుంది. ఈ ఏడాది రూ.12.20 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చింది.

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 33 మంది నేత కార్మికులకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. నగరంలోని నెక్లెస్ రోడ్‌లో నిర్వహించే వేడుకల్లో వీటిని ప్రధానం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయే ఈ కార్యక్రమాన్ని చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్ పాల్గొంటారు.

అవార్డుకు ఎంపికైె వారు....

కరీంనగర్ తుమ్మ రామస్వామి, గుర్రం కొండయ్య, మంచిర్యాల లిక్కి శంకరయ్య, వరంగల్ కంచె నర్సింగరావు జనగాం న్యాలపల్లి విజయ ప్రకాశ్, రాజన్న సిరిసిల్ల ఎల్దీ రేఖ, రంగారెడ్డి గంజాం శ్రీనివాస్, గుర్రం చంద్రమౌళి హైదరాబాద్ కర్దాసు రమేశ్, సిద్దిపేట జిందం రాజేశం, బైరి శ్రీనివాస్, మంతూరి వెంకటేశం, యాదాద్రి భువనగిరి గూడ పవన్. కొలను శంకర్, సామల భాస్కర్, మంగళపల్లి శ్రీహరి, చెలిమల కృష్ణ, నల్లగొండ కర్నాటి సదుర్గ, చిలుకూరి శ్రీనివాసులు, చిట్టిపోలు ధనుంజయ, గాజుల అనిల్, గుర్రం యాదయ్య, మునగపాటి శ్రీనివాస్, కర్నాటి కృష్ణయ్య, అవరి రవీంద్ర, నారాయణపేట జన్ను ఆంజనేయులు, యాంగల్ ఆంజనేయులు, జోగులాంబ గద్వాల్ సూర్య వెంకటేష్, లక్ష్మీ, వనపర్తి దేవరకొండ సీతన్న, శీల బుడ్డన్న, మహంకాళి సులోచన, సారంగి రాములు ఉన్నారు.

అసెంబ్లీకి రాని కెసిఆర్‌కు ప్రతిపక్ష నేత పదవి ఎందుకు..?

- మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని దివాళా తీయించారు
- సిఎం రేవంత్‌రెడ్డి తన భాష మార్చుకోవాలి
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నేతలు అధికారం కోల్పోయామనే ఫ్రస్టేషన్‌లో ఉన్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీకి రాని కెసిఆర్‌కు ప్రతిపక్ష నేతగా కొనసాగే అర్హత లేదని తెలిపారు. 'ఆయన అసెంబ్లీ కన్నా రావాలి. ప్రతిపక్ష నేత పదవికైనా రాజీనామా చేయాలి' అని డిమాండ్ చేశారు. గత పదేళ్లపాటు కెసిఆర్ కుటుంబంతోపాటు ఆంధ్రా పెట్టుబడిదారుల మాఫియా కాంట్రాక్టుల పేరిట లక్షల కోట్లు దోచుకుని ఈ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన మాట వాస్తవమేనన్నారు. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక దివాళా తీయించారని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డిజిటల్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రాన్ని 20 మంది ఆంధ్రా ప్రాంతానికి చెందిన పెట్టుబడిదారులు ఇప్పటికి కూడా తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. సమయం వచ్చినప్పుడు వారి బండారం బయట పెడతానని తెలిపారు. తెలంగాణ సంపద దోపిడీ చేస్తూ...ఈ ప్రాంతానికి ఎవరు అన్యాయం చేసినా బహిరంగంగా మాట్లాడుతానని చెప్పారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోపిడీ చేస్తమంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పదవుల కోసం దిగజారి ప్రవర్తించేది లేదని చెప్పారు. ప్రజల కోసం ఎటువంటి త్యాగమైనా సిద్ధం స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి తన భాష మార్చుకోవాలని సూచించారు.

విద్యార్థుల హాజరు శాతం నిబంధనల్లో జోక్యం చేసుకోం : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హాజరు శాతం నిబంధనల విషయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. యూనివర్సిటీ నిబంధనలను కోర్టులు తిరిగి రాయలేవని స్పష్టం చేసింది. పరీక్షలు రాయడానికి అవసరమైన హాజరు శాతం నిర్ణయాన్ని యూనివర్సిటీలు రూపొందిస్తాయనీ, ఇంజినీరింగ్ కోర్సు సాంకేతిక వ్యవహార అంశమని పేర్కొంది. ప్రాక్టికల్, థియరీ తరగతుల ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని నిబంధనలు రూపకల్పన ఉంటుందని అభిప్రాయపడింది. సాధారణంగా 75 శాతం హాజరు అవసరమనీ, అనారోగ్యం, క్రీడలు, ఎన్సీసీ వంటి ప్రత్యేక పరిస్థితుల్లో 10 శాతం మినహాయింపు వరకే అవకాశం ఉంటుందని తెలిపారు. దానికి మించి అనుమతించేందు వీల్లేదనే నిబంధనలను గుర్తు చేసింది. హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థిని పరీక్షలకు అనుమతిస్తూ ఆదేశాలివ్వలేమని పేర్కొంది. హాజరు తక్కువగా ఉన్న విద్యార్థి నిర్దిష్ట విద్యా సంవత్సరంలోగా సెమిస్టర్ పూర్తి చేయాల్సిందేనని వెల్లడించింది. హైదరాబాద్‌కు చెందిన కె. మాన్విత అనారోగ్యంతో హాజరు శాతం తక్కువగా ఉన్న కారణంగా బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలకు అనుమతించాలని సింగిల్ జడ్జి గతంలో ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రజా చైతన్యానికి ఉద్యమ నావ గద్దర్

- ప్రజా దర్శక నటుడు అర్ నారాయణ మూర్తి

ప్రజాశక్తి - కల్చరల్

ప్రజా చైతన్యం ఉద్యమ నావ వాగ్గేయకారుడు గద్దర్ అని ప్రజా దర్శక నటుడు అర్ నారాయణ మూర్తి అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై గద్దర్ ఫౌండేషన్ నిర్వహణలో రెండవ వర్ధంతి సభ ఆయనపై పాటలు, ఆయన గీతాలతో, ఉద్యమ గీతాలతో ఆడిటోరియం ప్రతిధ్వనించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ స్థాపకుడు క్రాంతి కిరణ్ సారథ్యంలో జరిగిన సభా కార్యక్రమంలో నారాయణ మూర్తి మాట్లాడుతూ గద్దర్ జీవితాంతం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన మాట పాటతోనే కాకుండా ఉద్యమంలో పాల్గొన్న యుద్ధ నౌక అన్నారు మార్క్స్ సిద్ధాంతం అంబేద్కర్ రాజ్యాంగంను మిళితం చేసి సమాజ మార్పు కోసం జీవితాన్ని అంకితం చేసిన తెలంగాణ తొలి ఉద్యమ కారుడని గుర్తు చేశారు. గద్దర్ పేరిట సినిమా అవార్డులు ప్రభుత్వం ఇవ్వడం సముచితం అని ఆయన సినిమాలో ఉద్యమ పాటలతో పాటు ఉదాత్త గీతాలు రాసారని చెప్పారు. అవార్డు లో గద్దర్ చిత్రంవుండాలి అని కోరారు. ప్రజా గాయకుడు జయ రాజ్ మాట్లాడుతూ గద్దర్ వ్యక్తి కాదు ఉద్యమ శక్తి అన్నారు. వేదికపై సాంస్కృతిక సారథి వెన్నెల విమల గద్దర్ సుల్తాన్ యాదగిరి కవి నర్సిరెడ్డి సిపిఎం నాయకులు జూలకంటి రంగారెడ్డి నరసింహా రావులు మాట్లాడుతూ గద్దర్ పేద వర్గాల పక్షపాతి అన్నారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బడికి తాళం వేసి విద్యార్థుల నిరసన

- ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమకు పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులను కేటాయించాలంటూ విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి బడికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా కుభీర్ మండలం సాంగ్వి గ్రామంలో బుధవారం జరిగింది. బడిలో పాఠాలు బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో మెరుగైన విద్యాబోధన అందడం లేదని, 55 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా ఇద్దరు విద్యావాలంటీర్లను నియమించి వారికి గౌరవవేతనం తామే చెల్లిస్తున్నామని, దీంతో తమపై ఆర్థికభారం పడుతోందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ విషయంపై మండల విద్యాధికారి విజయ్ కుమార్‌ను వివరణ కోరగా.. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా అందులో నుంచి ఒక్క ఉపాధ్యాయురాలు మెటర్నీటి సెలవులో ఉన్నారని తెలియజేశారు. ప్రస్తుతం ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారని, విద్యార్థుల సమస్యను దృష్టిలో పెట్టుకుని పైఅధికారులకు తెలియజేస్తామని, సాధ్యమైనంత వరకు ఉపాధ్యాయుడిని నియమించేలా చూస్తామని చెప్పారు.

25 రైల్వే స్టేషన్లలో 80 బ్యాటరీ స్వాపింగ్ కేంద్రాలు

- ఇండోఫాస్ట్ ఎనర్జీ సిఇఒ అనంత్ వెల్లడి

హైదరాబాద్ : భారతీయ రైల్వేలతో కలిసి ఇండోఫాస్ట్ ఎనర్జీ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లలో 25 రైల్వే స్టేషన్ల వద్ద 80 బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసిందని ఇండోఫాస్ట్ ఎనర్జీ సిఇఒ అనంత్ బద్జాత్య తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సంజీవయ్య పార్కు సమీపంలో నూతన బ్యాటరీ స్వాపింగ్ కేంద్రాన్ని ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే మూడు నెలల్లో మరో 40 స్టేషన్లు రానున్నాయన్నారు. స్వచ్ఛ ఇంధన మిషన్‌కు తోడ్పడుతూ విద్యుత్ వాహన వాడకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో సిపిఐ రాష్ట్ర నేత అయోధ్యచారి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అయోధ్యచారి (ఫైల్‌ఫోటో)

రోడ్డు ప్రమాదంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్యచారి మరణించారు. ఈ ఘటన బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉంటున్న తన కుమార్తె వద్దకు అయోధ్యరెడ్డి వచ్చారు. బుధవారం ఉదయం కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. జిల్లా కేంద్రంలోని యస్వీ డిగ్రీ కళాశాల సమీపంలో ధర్మభిక్షం విగ్రహం వద్దకు రాగానే విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ అయోధ్య కారును వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సిపిఐ శ్రేణులు అయోధ్యచారి మరణంతో దిగ్భ్రాంతికి లోనయ్యాయి. పార్టీ నేతలు, అభిమానులు ఆస్పత్రికి చేరుకొని ఆయనకు నివాళులర్పించారు.